
# పిలుపు

వి వి బి రామారావు



“యావండీ!” అని గోముగా పిలిచి మళ్లీ మౌనంగా ఆలోచనలలో పడిపోయింది సులోచన

ఆమెవంకే అలాచూస్తూ బెడ్‌పక్కన స్టూలు మీద కూచున్న సుధాకర్ లేచి ఆమె తలదగ్గరకు వంగి అడిగాడు—

“ఏమిటి లిల్లీ ఆలోచన ఒంట్లో బాధగా ఉందా ?”

“హ్హా ! లేదండీ ! ” ఆమె పెదవులు వణుకుతున్నాయి

“మీ నాన్నగారికి టెలిగ్రాం ఇచ్చేదా ?”

“వద్దు నాదొక చిన్నకోరిక. కాదనకండి హుహూ !”

మళ్లీ గట్టిగా నిట్టూర్చింది

“చెప్పు లిల్లీ ! చాక్లెట్ కావాలా ?”

—నవ్వుతూ మళ్లీ స్టూలుమీద కూచున్నాడు

“నవ్వులాట కాదండీ! మీరిక నన్ను నవ్వించలేరు ఇక నాకు నవ్వురాదు మీ అక్కయ్యగారు మిమ్మల్ని 'బాబీ' అని పిలిచేవారు కదూ! తల్లిలా మిమ్మల్ని పెంచారు మీరిద్దరూ మాటాడుకుంటూ ఉంటే కళ్లారా ఒక్కసారిచూస్తాను ”

“అక్కని రమ్మని రాయమంటావా అంతేనా ? ఓ యస్! ఇప్పుడే రాస్తా ఎల్లుండికి వచ్చేస్తుంది ”

చాలా తేలికగా అనేశాడు సుధాకర్ అతను అంత సులువుగా ఉత్తరం రాయలేడని తెలుసు సులోచనకి

*    *    *

కెవ్వున కేక వేసింది మీనాక్షి

పక్కనున్న డాక్టర్ కరుణాకర్ లేచి ఆమెను కుదిపి లేపాడు

ఆమె అరుస్తూనే ఉంది

మీద ట్యూబ్‌లైట్ వెలిగాక ఆమె కుదుట పడింది మొహమంతా చెమటపట్టింది

“ఏమైంది, మీనా?”

“ ”

పీడకల వచ్చిందా ?”

“పెద్దమ్మాయిని పిలవ ”

“ఇప్పుడు టైమెంతయిందో తెలుసా ?”

“ పోనీ నేనే వెళతా !?”

అయోమయంగా చూశాడాయన

ఆమె లేచి పెరట్లోకి వెళ్లిపోయింది

డ్రస్సింగ్ టేబిల్‌మీద కరుణాకరరావ్‌గారికి ఓ ఉత్తరం కంటపడింది “మహాలక్ష్మి సంపన్నురాలైన అక్కకి బాబీ నమస్కరించి వ్రాయునది నేను చేసినది పొరపాటని నేననుకోను కాని నువ్వు పొరపాటే అనుకుంటే ఈ తరుణంలో నన్ను క్షమించి ఒక్కసారి నీ మరదలిని చూడడానికి రా సులోచనకు కాన్పు కష్టమయ్యేటట్టుందని, ఇంకా కొంత టైమున్నా వెంటనే నర్సింగ్‌హోమ్‌లో చేర్పించమని లేడీడాక్టరు సలహా ఇచ్చింది డాక్టరు చెప్పిన మాటల్లో ఏదో ప్రమాదం కనబడుతున్నా నేను సులోచనకు ఏం చెప్పకుండానే చేర్చాను నేను ఎంతో జాగ్రత్తగా దాచాలనుకున్న రహస్యం సులోచనకు ఎలాగో తెలిసిపోయింది తను చనిపోతానన్న భయంతో—కుంగిపోతోంది తనవాళ్లకు ససేమిరా రాయవద్దంది

నన్ను నీబిడ్డలా పెంచావ్ ! అక్కా ! మనమిద్దరం మాటాడుకుంటుంటే చూస్తాననిముచ్చట పడుతోంది నీ మరదలు సులోచన ఇది 'కడసారి కోరిక' అంది ఒక్కసారి వస్తావుకదూ!”—కరుణాకరరావ్ మనస్సు కలుక్కుమంది తనభార్య ఐదేళ్ల బిడ్డనించి పెద్దవాడిని చేసింది—తనబిడ్డలతో సమా

నంగా తన తల్లికిచ్చినమాట నిలబెట్టుకుంది తన మీద వాడికి అంతఅసహ్యం కలిగిందంటే తన పెంపకానికే మచ్చ ఎంత సరిపెట్టుకోవాలన్నా వాడు చేసినపని సమంజసంగా కనబడటంలేదు

అంత మనసుపడితే చదువుకున్నవాడు---యుక్తాయుక్త విచక్షణ తెలిసినవాడు 'నేను ఆ అమ్మాయిని చేసుకుంటా'నంటె తను కాదనేదా?—

- ఉపకారం చేసి మరచిపోవాలన్నారు కుడిచేతితో ఇచ్చినది ఎడమచేతికి తెలియనివ్వకూడదనీ అన్నారు నిష్కామ కర్మ చెయ్యాలన్నారు

— మమతచూసి మమతను అపేక్షించడం తప్పా?

మమతకు ప్రతిగా మమత రాకపోగా నిరసన భావం—తృణీకరణవస్తే మనసు గాయపడకుండా ఉండగలదా? —

మనసుని గాయపరచుకోకుండా ఉండడం ఎలా సాధ్యం? కాని తనేమో భార్యతో ఆనాడే చెప్పాడు

"రెక్కలొచ్చిన పక్షి మరోగూడు కట్టుకుని ఎగిరిపోయింది--దానికోసం నీమనసును బాధపెట్టుకోవడం అవివేకం మీనాక్షీ నువ్ ఆ విషయం మరచిపో!

తల్లీ తండ్రీ లేకపోతేనేం చిన్నవాడేమిటి? వాడికి తెలియనక్కరలేదూ? ఎవరో వాడిని బుట్టలో వేశారంటున్నావ్!

వాళ్లని నేననను పిడిలోనే ఉంది మన బంగారం మంచిదయితేకదా! పైవాళ్లమీద దుఃఖపడడానికి

ఎంత ఆలోచించినా ఒక్కవిషయమే నాకు బోధపడుతోంది మన చిన్నమ్మాయిని వాడికి కట్టబెట్టేదృష్టితో మనం ఈ పెళ్లికి అడ్డుపెడతాం అనుకున్నాడేమో వర్ణాంతరమట మనం పెళ్లికి వెళ్లడంకూడా ఇష్టంలేదన్నమాట! వాడంతట వాడయ్యాడు వాడిడబ్బు వాడి ఆఫీసు ఎడ్రసుకు పంపేశాను నువ్ అమాయకురాలివి మీనా డబ్బుకోసం ఎన్నాళ్ళ వస్తాడు వాడు! నువ్ కంటతడి పెట్టి ఏం లాభం? అడ్డాలనాడే బిడ్డలన్నమాట ఊరికే వచ్చిందా? నా ఎదుట వాడి ప్రస్తావన తేకు!"

భార్య మనసు ముప్ఫై ఏళ్లయి కాపురం చేస్తున్న కరుణాకరరావ్‌కు తెలియనిదికాదు

మీనాక్షి తమ్ముడి ప్రస్తావన మళ్లీ ఎప్పుడూ తేలేదు మాటంటే మాటే

అంతేకాదు ఆమె పడేబాధ తనకూ తెలుసు తమ్ముడి ప్రస్తావన తీసుకురావడం మనసులోని గాయాన్ని కెలికినట్టే అవుతుంది!

కరుణాకరరావ్ ఉత్తరం అక్కడ పడేసి తన పనిలో తను మునిగిపోయాడు

పదకొండుగంటలకి నర్సింగ్‌హోమ్‌లో ఉండగా తనపేర వచ్చింది ఉత్తరం

డాక్టర్ కారుణాకరరావ్ గారికి!

నేనెవరో మీకు చెప్పుకోవలసిన అవసరం ఉంది నేను మీరు పెద్దచేసిన 'బాబీ' గారి భార్య సులోచనని

మీకు చెప్పకుండా నన్ను చేసుకుని, చేసుకున్నాక చెప్పలేదని కుమిలిపోతూ ఈ స్థితిలో ఒంటరివాళ్లయే ప్రమాదంలో చిక్కుకున్నారు 'బాబీ'!

నర్సింగ్‌హోమ్‌లో నన్ను జాయిన్ చేశారు నా ప్రాణం ప్రమాదంలోఉందని డాక్టర్ చెప్పినట్లు నా దగ్గర దాచారు

ధైర్యంచేసి ఉత్తరం రాస్తున్నాను

ఆరోజే నేను చచ్చిపోయాననుకుని గుండె రాయి చేసుకున్నారు నా వాళ్లు నా వాళ్లకు రాసి ప్రయోజనంలేదు వాళ్లవచ్చినా ఆయన్ను ఆదుకోలేరు

నన్ను చేసుకున్న ఆనందం కంటె మీకు దూరమయ్యానన్న వేదనే ఆయనలో ఎక్కువగాఉంది రోజు రోజుకీ ఆయనకు దిగులు ఎక్కువైపోతోంది

ఆయనది చాలా సున్నితమైన మనసు

జలతారు కలలు బంగారానివే అయినా కలలే నా అన్నవాళ్ల మమతే నిత్యం, సత్యం ఆయన మిమ్మల్ని వదలలేరు

మీరంటే భయం అందుకే ఇలా చేశారు నా మాట నమ్మండి

నా తదనంతరం ఆయన్ను ఆదుకుని ఆసరాగా నిలిచి మీరు ఎంచిన పిల్లకే ఆయనకుచేసి ఆయన మనసులోని మంటలనార్పి నా ఆత్మకి శాంతి చేకూర్చండి మీ బాబీమీద కోపం మీ కుంటుందని నేనను కోను నేనేపైదాన్ని మనుషులమీదనున్న ద్వేషం, క్రోధం వారితో బుగ్గిచెయ్యండి పోతు పోతూ నే కోరుకునే కోరిక ఇది

అభాగ్యురాలు
సులోచన–

ఉత్తరం చదివి విశ్మయానికి వచ్చాడు కరుణాకరరావ్‌గారు

* * *

డాక్టర్ అహల్య నర్సింగ్‌హోమ్ వరండాలో చాలామంది స్త్రీలు ఆమెకోసం వెయిట్ చేస్తున్నారు సులోచనను చూచాక కరుణాకరరావ్‌గారు నేయగా లోపలికి వెళ్లిపోయారు

"హలో డాక్టర్ కరుణాకరరావ్! వెరీగ్లాడ్ టు సీయూ! ఎప్పుడొచ్చారు ఏమిటి విశేషాలు?"

డాక్టర్ అహల్య లేచినుంచుని పలకరించింది

అహల్యా, తనూ పాతికేళ్లక్రితం కలసి చదువుకున్నారు

"ఇప్పుడే వచ్చా ఇటురండి" దోవలో చెప్పాడు

"నే చూశా ఇక పదినిమిషాల్లో ఆపరేట్ చేసి బిడ్డను తీసెయ్యాలి"

"ఎవరిగురించి మాటాడుతున్నారు ఈ ఊరెప్పుడొచ్చారు?"

"ఇటురండి"

సులోచన బెడ్‌దగ్గరకు తీసుకొచ్చాడు—

ఆమెకూడా ఎగ్జామెన్ చేసి—వడివడిగా బయటకు వచ్చింది

"కమాన్ డాక్టర్!" అంటూ కరుణాకర్‌ను వెంటబెట్టుకుని థియేటర్‌కు వెళ్లింది

"మీరు చెప్పింది రైటే కొన్నిరోజులనించే అబ్జర్వేషన్‌లో పెట్టా పొద్దున్న పరిస్థితి ఇలా లేదు"—ఆవిడ స్టాఫ్‌కి చకచకా ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చేసింది

"మీరు కొంచెం సహాయం చెయ్యాలి ఐ విల్ డు మై బెస్ట్"

కరుణాకరరావ్ తనలో ఒక్కక్షణం ఆలోచనలు సుడులు తిరిగాయి

హే భగవాన్ ఏమిటీ పరీక్ష!

ఈమె చనిపోతే గాడ్‌ఫర్‌బిడ్!

నేను కక్షకొద్దీ ఆమెను చంపానని బాబీ అనుకోవచ్చు మనిషికి ప్రాణంపోసేశక్తి నాకులేదే!-

— తనకేం తెలుసు—తను ఆ క్షణంలో రాకపోతే నర్సింగ్‌హోమ్ పని ముమ్మరంతో అహల్య వచ్చేసరికి సమయం మించిపోయి ఉండేది —

—తనను బాబీ కనీసం పలకరించలేదు

ఎవరో డాక్టర్‌లా తను ఆమెను పరీక్ష చేశాడు —

—చూస్తున్న వైద్యురాలికంటె ఘనుడి ననుకుని వచ్చాను ఇప్పుడెలా?

— లేదా ఇంతవరకూ వచ్చింది ఆమెమంచికే

"బాబయ్యగారూ" అంటూ స్ట్రెచర్ మీద నుంచి చేతులు జోడించింది సులోచన

"ఏం భయం లేదమ్మా నువ్ కంగారు పడకు నీబిడ్డను నీచేతికిచ్చే పూచీ నాది"

థియేటర్ లోపలకి స్ట్రెచర్ వెళ్లింది

బాబీ చేతులు జోడించటం, కళ్లు తుడుచుకోవడం కరుణాకరరావ్ చూడనేలేదు

—థియేటర్‌లోకి అడుగుపెట్టిన కరుణాకర్‌రావ్ మనసులో మరో ఆలోచన లేదు

గంటయ్యేసరికి కేర్ కేర్ మని పురిటికందు ఏడుపు

"మీరు రాకపోయిఉంటే ఈమె బ్రతికేది కాదు సమయానికి వచ్చారు"

"గాడ్‌ఈజ్ గ్రేట్ మరల తీరికగా మాటాడుకుందాం ఐ హేవ్ ఎ సీరియస్ కేస్ ఎట్ హోం ఐ హేవ్‌టు గో" మాట్లాడుతూనే మాస్క్‌తీసేసి 'ఐవిల్ మీట్ యూ ఎగైన్'' అంటూ బయటకు వచ్చాడు

"కంగ్రాట్యులేషన్స్! ఓ అరగంట తరువాత నువ్ బిడ్డని చూడవచ్చు అన్నట్టు మరచిపోయాను ఆడబిడ్డ" థియేటర్ ముందున్న బాబీకి చెప్పాడు

ఇంటి కొచ్చేసరికి రాత్రి ఎనిమిదైపోయింది

"మధ్యాహ్నం భోజనానికి రాలేదు"

"పురిటి కేసుకెళ్లాను నేను పేషెంటును తొందర చెయ్యలేనుగా నీ తమ్ముడికి కూతురు పుట్టింది—నువ్వెళ్లిచూడు రేపు తెల్లారాక!"

భర్త చెబుతూఉంటే అలా నుంచుండిపోయింది ఆ ఇల్లాలు —

"మీరు మీరు వెళ్లారా?"

"పిలుపు వచ్చింది వెళ్లాను వెళ్లకూడదా?

వాడైతే నీకు తమ్ముడు నిన్ను మరచిపోయినా వాడిని నువ్వు మరచిపోయినా అది శిక్షార్హమైన నేరంకాదు

ఆర్తనాదం చేస్తున్న రోగి పిలుపు నందుకోపోతే వృత్తిధర్మం దృష్ట్యా నేను శిక్షార్హుణ్ణే"

భర్త తర్కం మీనాక్షమ్మకి బోధపడలేదు ఆయనవంకచూస్తూ ఆవిడ అలా నుంచుండిపోయింది ●